క్లుప్తంగా

ఇండోర్ గేమ్స్‌తో పిల్లల్లో సృజనాత్మకత



ఇండోర్ గేమ్స్ ఆడుతున్న విద్యార్థులు

మురళీనగర్: పిల్లలు తమ ఆలోచన శక్తిని, మేధస్సును పెంచే క్రీడల్లో పాల్గొనాలని డీజిల్ లోకో షెడ్ జూనియర్ ఇంజినీర్ జామి అన్నాజీ రావు సూచించారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం ఆయన పాల్గొని విద్యార్థులకు ఇండోర్ గేమ్స్‌పై అవగాహన కల్పించారు. చదరంగం, డోమినోస్, క్యారమ్స్ ఆటలు పిల్లల్లో సృజనాత్మక ఆలోచనలను పెంచుతాయన్నారు. ఆటలతోపాటు ప్రతి రోజు పుస్తకాలు, నీతి కథలను చదవాలని సూచించారు. విద్యార్థులతో క్యారమ్స్, చదరంగం, డోమినోస్ ఆటలను ఆడించారు. గ్రంథాలయ అధికారి వై.పద్మజ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నాణ్యమైన పూజా సామగ్రి విక్రయించండి



పూజా సామగ్రి వ్యాపారులకు సూచనలిస్తున్న ఈవో శేఖర్‌బాబు

సీతమ్మధార: భక్తులకు నాణ్యమైన పూజా సామగ్రి విక్రయించాలని వ్యాపారులకు నక్కవానిపాలెంల ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి శేఖర్‌బాబు సూచించారు. ఆలయ ఆవరణలో సమస్యలను సోమవారం ఆయన పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌తోపాటు ఇతర సమస్యలపై ఆరా తీశారు. పూజా సామగ్రి విక్రయిస్తున్న షాపుల యజమానులతో ఈవో మాట్లాడుతూ ఆలయం వద్ద వాహనాలు పార్క్‌చేసే భక్తులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూజా సామగ్రి రోడ్డుపై పెట్టకుండా జాగ్రత్త పడాలని లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. ఈవో వెంట అర్చకుడు మహేష్ ఉన్నారు.

నేడు పైడితల్లమ్మ అనుపోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం గ్రామ ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారి ప్రతిమ అనుపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి భక్తు లు మొక్కులు చెల్లించుకోవచ్చని చెప్పారు. సాయంత్రం 6.30 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సేవ గరిడీలు, పులివేషాలు, నేలవేషాలు, కోబ్రా డ్యాన్స్‌లతో అనుపు కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

బాలిక అదృశ్యం



ఫలక్ పర్వీన్

మర్రిపాలెం: ఓ బాలిక అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఒడిశా రాష్ట్రం రూర్కెలాకు చెందిన ఫలక్ పర్వీన్ కొన్ని నెలలుగా జ్ఞానాపురం గెడ్డ వీధిలోని తన మావయ్య మహమ్మద్ సలీమ్ రజా కుటుంబంతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 10న మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన పర్వీన్ తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం బాలిక మావయ్య కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

పేదల వైద్యానికి భరోసా

- ప్రజా సేవలో రేసపువానిపాలెం ఆరోగ్య కేంద్రం
- అందుబాటులో 62 రకాల టెస్ట్‌లు.. 172 రకాల మందులు



రోగికి బీపీ చెక్‌చేస్తున్న సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేదల వైద్యానికి భరోసాగా నిలుస్తోంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యాధికారి, స్టాఫ్ నర్స్‌లు, ల్యాబ్ అసిస్టెంట్, ఎల్‌జీఎస్, మెడికల్ స్టాఫ్‌తోపాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు విశేష సేవలందిస్తున్నారు. సుమారు రోజుకు 40 నుంచి 50 మంది వరకు రోగులు ఇక్కడికి వస్తుంటారు. 62 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. మలేరియా, డెంగ్యూ, రక్త పరీక్షలు, హెచ్‌బీ, కిడ్నీతో పాటు ఇతర టెస్ట్‌లు చేస్తుంటారు. రోగులకు 172 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నారు. కొత్తగా ల్యాబ్ టెస్ట్ మిషన్ అందుబాటులోకి వచ్చింది. కరోనా నిర్ధారణ టెస్ట్‌లు చేసి పాజిటివ్ వస్తే వారికి కిట్లు అందించి సిబ్బంది పర్యవేక్షణలో ఉంటారు. ప్రతి శని, బుధవారం పిల్లలు, గర్భిణులకు టీకాలు వేస్తుంటారు.



రేసపువానిపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రతి రోజూ ప్రత్యేక సర్జన్ సేవలు

ఈ ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓ సర్జన్ ప్రత్యేక ఓపీ వైద్య సేవలందిస్తుంటారు. వాటిని ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ మనస్వి పర్యవేక్షిస్తుంటారు.

- **సోమవారం:** ఆర్థోపెడిక్ వైద్యుడు కె.రాకేష్‌కుమార్, పెడియాట్రిక్స్ డాక్టర్ జి.గోపిచంద్..
- **మంగళవారం:** జనరల్ మెడిసన్ డాక్టర్ మహరాజ్, ఆప్తమాలజీ సేవలు..
- **బుధవారం:** పల్మనాలజీ డాక్టర్ కె.రూప, డెర్మటాలజిస్ట్ డాక్టర్ రమ్యకృష్ణ, ఈఎన్‌టీ డాక్టర్ బి.స్రవంతి..
- **గురువారం:** గైనకాలజిస్ట్ డాక్టర్ జి.శిరీష, జనరల్ సర్జన్ డాక్టర్ అమర్‌నాథ్..
- **శుక్రవారం:** ఆప్తమాలజీ సేవలు
- **శనివారం:** జీరియాట్రిక్స్ వైద్యుడు వై.దిలీప్‌కృష్ణ అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలందిస్తారు.
- శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారు. బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈఎన్‌టీ వైద్యులు సేవలందిస్తున్నారు.

24వ వార్డు(ఐదు సచివాలయాలు), 22వ వార్డు(ఏడు సచివాలయాలు), 25వ వార్డు(రెండు సచివాలయాలు)లకు చెందిన ప్రజలు రేసపువానిపాలెం ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యపరమైన సేవలు పొందుతున్నారు.



వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి డాక్టర్ మనస్వి



ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేస్తున్న అసిస్టెంట్

అన్ని సేవలు అందిస్తున్నాం

ప్రజలకు ఎల్లప్పుడూ అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నాం. అత్యవసర సమయంలో కూడా అందుబాటులో ఉంటున్నాం. వారికి ఉచితంగా మందులు పంపిణీ, వైద్య పరీక్షలు అందుబాటులో ఉంచాం. రేసపువానిపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు పొందుతున్న ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– డాక్టర్ మనస్వి, వైద్యాధికారి

ప్రతి గడపలో ఆత్మీయ పలకరింపు



50వ వార్డులో సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ ప్రసాద్

మర్రిపాలెం: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రతి గడపలో ఆత్మీయ పలకరింపు ఉందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 50వ వార్డు మురళీనగర్–2 సచివాలయం(278) పరిధిలోని వాకర్స్ పార్క్, వర్మ కాంప్లెక్స్, మురళీనగర్ సెక్టార్–6, 7 తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం, సాయంత్రం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పథకాల అమలు, ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు, ప్రజల సమస్యలను ప్రజా ప్రతినిధులు నేరుగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, డైరెక్టర్ రాయుడు శ్రీను, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, పార్టీ 50వ వార్డు నాయకులు పైడి కృష్ణారావు మాస్టర్, పప్పల సునీత, సనపల నారాయణ స్వామి, అంబటి శైలేష్, ఏవీఎస్ రాజు, పాతపట్నం రామ్మోహన్, సబ్బవరపు శ్రీను, కాంచన రాజేశ్వరరావు, ఎం.లక్ష్మి, సోనీ, దాలినాయుడు, జగదీష్, శివాజీ, శ్రీనివాసరాజు, శివరాం కృష్ణనాయుడు, ప్రకాష్, సునీల్, షేక్ బాబ్జి, రాఘవులు, అధికారులు, సచివాలయ సిబ్బంది తతదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 10 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 అర్జీలు అందాయి. తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ శ్యామ్‌ప్రసాద్ అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చేతన్‌కుమార్, ఆర్‌ఐ రవికృష్ణ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జోన్-5కు 4 వినతులు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. ఆర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 01, పబ్లిక్ హెల్త్‌కు 01, యూసీడీకి 01, రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరత్‌కుమార్, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ యూసీడీ కె.శైలజ, సీడీవో పద్మావతి పాల్గొన్నారు.

పరదేశమ్మ పండగ నేడు



తొలేళ్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం, రైల్వే న్యూకాలనీ పరిధిలోని పరదేశమ్మ పండగ మంగళవారం జరుగనుంది. ఈ సందర్భంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు దొండపర్తి నుంచి అమ్మవారి ప్రతిమలను ఊరేగించారు. మంగళవారం ప్రధాన పండగ, ఈ నెల 23న మరువారం సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి అనిల్‌భవాని ఆధ్వర్యంలో మహిళలచే అమ్మవారికి సారె సమర్పించనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. పరదేశమ్మ ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.

బైక్ ఢీకొని అడ్వకేట్ కుటుంబానికి గాయాలు

మర్రిపాలెం: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ కుటుంబంలో ఇద్దరికి గాయాలైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆదివారం రాత్రి ఊర్వశి జంక్షన్ నుంచి బిర్లా కూడలి వైపు ఒకే దారిలో ప్రయాణిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో అడ్వకేట్ రమేష్, ఆయన భార్యకు గాయాలయ్యాయి. ఒక బైకుపై రమేష్ తన కుటుంబం.. మరో బైకుపై యువత వస్తున్నారు. వీరిద్దరి ద్విచక్ర వాహనాలు ఒకదాన్ని మరొకటి ఢీకొనడంతో అడ్వకేట్ కుటుంబం కిందపడిపోయింది. రమేష్ వారిని ప్రశ్నించగా.. అసభ్యకరంగా తిట్టడమే కాకుండా వెనుక నుంచి వారి స్నేహితులు కూడా వచ్చి ఆయనను కొట్టి గాయపరిచారు. దీంతో వారిని కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. రమేష్ ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చురుగ్గా బీటీ రోడ్ల నిర్మాణం



బీటీ రహదారిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సారిపల్లి గోవింద్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 25వ వార్డు గురుద్వారా నుంచి సీతంపేట రిలయన్స్ పెట్రోల్ బంక్ వరకు ఇరువైపులా బీటీ రోడ్లు మంజూరయ్యాయి. సుమారు రూ.50 లక్షలతో ఈ రహదారులను చురుగ్గా నిర్మిస్తున్నారు. ఇటీవల ప్రారంభించిన ఈ పనులను సోమవారం కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్ పరిశీలించారు.

బీసీ సేవా సంఘం నూతన కమిటీ నియామకం

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం సమావేశం సోమవారం సంఘ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి రాష్ట్ర స్థాయి కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొణతాల శ్రీనివాస్(విశాఖపట్నం), సలహా కమిటీ చైర్మన్‌గా రిటైర్డ్ జడ్జ్ బి.రామారావు(శ్రీకాకుళం), రాష్ట్ర అధికార ప్రతినిధిగా బమ్మిడి గంగాధర్(శ్రీకాకుళం), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.రామకృష్ణ నాయుడు(శ్రీకాకుళం), కోశాధికారిగా ఎం.ఉమా మహేశ్వరరావు(విశాఖపట్నం), రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఆలేటి హేమలత(విశాఖపట్నం), సీహెచ్ వెంకటేశ్వరరావు(విశాఖపట్నం), సనపల అన్నాజీ రావు(శ్రీకాకుళం), జి.అప్పలనాయుడు(విజయనగరం), ఎం.ఎల్లారావు(అనకాపల్లి), అదనపు ప్రధాన కార్యదర్శులుగా కోటా రమేష్, కె.మధుసూదన్, రాఘవకుమార్, జి.వెంకటరావు.. కార్యదర్శులుగా కొప్పుల రామ్‌కుమార్, సన్యాసినాయుడు, జె.భాస్కర్, కె.అప్పలనరసమ్మ.. సహాయ కార్యదర్శులుగా కొయ్య రామకృష్ణ, అప్పలరాజు, శ్రీనివాస్, కృష్ణారావు, అప్పన్న, పలువురు నిర్వహణ కార్యదర్శులు, సహాయక కోశాధికారి, సలహా కమిటీ సభ్యులను నియమించారు.

ఎంఎల్‌ఆర్ విభాగంలో ఆత్మీయ సమ్మేళనం



విభాగ ఆచార్యులతో పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగంలో సోమవారం మిలీనియం బ్యాచ్(2000–2002) పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఇక్కడ చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పలువురు కలుసుకుని అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. విభాగ ప్రగతిని ప్రత్యక్షంగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. విభాగ అభివృద్ధికి, ప్రస్తుత తరం విద్యార్థులకు ఉపాధి కల్పన, మార్గదర్శకం అందించడానికి తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా విభాగ ఆచార్యులను సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్యులు రమణమూర్తి, కె.రమేష్‌బాబు, ఏడుకొండలరావు, అధ్యాపకులు గణేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సర్ ఆర్థర్ కాటన్‌కు ఘన నివాళి



కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో సోమవారం సర్ ఆర్థర్ కాటన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా విభాగం వద్దనున్న కాటన్ విగ్రహానికి పూలమాల వేసి ఆచార్యులు నివాళులర్పించారు. అనంతరం ×ట్రెండింగ్ ప్రాక్టీసెస్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్¶ అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. సదస్సును విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య వజీర్ మహ్మద్, సాంకేతిక, పరిశ్రమల నిపుణులు బ్రహ్మాజీరావు, బోయిన, ఆచార్య జి.మురళీకృష్ణ, విభాగ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం దిశగా 'గ్రీవెన్స్'



ప్రజా వినతులు పరిశీలిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం దిశగా గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. పలు వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించిన కె.కె.రాజు అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలు తక్షణం పరిష్కరించారు. మిగిలిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వ్యక్తిత్వ వికాస తరగతులు

- వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహణ
- పేర్ల నమోదుకు ఆహ్వానం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి కళాశాలల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, లంకా వెంకట సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగిన దృష్ట్యా వ్యక్తిత్వ వికాసం ప్రాధాన్యం పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులు తడబాటు లేకుండా తమ భావాలను వ్యక్తపరచడంతోపాటు జీవన నైపుణ్యాల అభివృద్ధి, కెరీర్ ప్లానింగ్ వంటి అంశాలపై నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కు ఆవరణలో నాలుగు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియట్, ఆపైన చదువుకుంటున్న విద్యార్థులందరూ హాజరు కావచ్చని చెప్పారు. విద్యార్థులు తమ పేర్లను వాకర్స్ పార్కులోని కార్యాలయంలో నేరుగా లేదా 94901 84360, 83091 57522, 94404 01874 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కోరారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- రైల్వే ఉద్యోగులకు ఈకార్వో ప్రెసిడెంట్ సూచన
- ఈకార్వో ఆధ్వర్యంలో ఆరోగ్య, రక్తదాన శిబిరాలు



రక్తదాత ప్రవీణ్ భటికి ప్రశంసాపత్రం అందిస్తున్న పారిజాత సత్పతి, మధు, డాక్టర్ సుమన

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సహకారంతో సోమవారం శుభం ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రక్తదాన, ఆరోగ్య అవగాహన శిబిరాలు నిర్వహించారు. లైఫ్ షేర్ బ్లడ్ సెంటర్ నేతృత్వంలో జరిగిన రక్తదాన శిబిరంలో రైల్వే ఉద్యోగులు, అధికారులు, ఇతరులు పాల్గొన్నారు. సుమారు 80 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ప్రవీణ్ భటి, డివిజనల్ ఇంజినీర్(ఆపరేషన్స్) అవినాష్, సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి, ఇతర అధికారులతో కలిసి రక్తదానం చేశారు. వీరందరికీ ముఖ్య అతిథి ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఇండస్ హాస్పిటల్స్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత ఆరోగ్య అవగాహన శిబిరంలో సుమారు 200 మంది ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు. సంధ్య కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు చేశారు. మహిళల్లో ఫోలిక్ యాసిడ్ ప్రాముఖ్యాన్ని వివరించారు. ఉద్యోగులు, సిబ్బంది అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్న ఇటువంటి శిబిరాల్లో పరీక్షలు చేయించుకోవాలని పారిజాత సత్పతి సూచించారు. మారుతున్న జీవన ప్రమాణాలకు అనుగుణంగా ఆరోగ్య నియమాలు పాటిస్తూ, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తీసుకుంటూ, యోగా, వాకింగ్ వంటివి అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమాల్లో డివిజనల్ రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరు అరుల్ జోతి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బి.మధు, డాక్టర్ సుమన ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. రైల్వే అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, క్రీడాకారులు, రైల్వే భద్రతా దళ సిబ్బంది, మహిళా ఉద్యోగినులు హాజరయ్యారు.

బాలబాలికలకు యోగాలో శిక్షణ



యోగాసనాలు నేర్పిస్తున్న పారిజాత సత్పతి



యోగా శిక్షణలో పాల్గొన్న బాలబాలికలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ పారిజాత సత్పతి ఆధ్వర్యంలో సోమవారం 12 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు గల బాలబాలికల కోసం ప్రత్యేక యోగా శిక్షణ శిబిరం ప్రారంభించారు. రైల్వే స్పోర్ట్స్ ఎరీనాలో ఈ నెల 22 వరకు ప్రతి రోజు ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుంది. నాగ్‌పూర్‌కు చెందిన జనార్దన్ స్వామి యోగాభ్యాసి మండల్‌చే రూపొందించిన శిక్షణను యోగాలో సుమారు 11 ఏళ్ల అనుభవం గల యోగా ప్రవీణ పారిజాత సత్పతితోపాటు సుశిక్షితులైన యోగా శిక్షకులు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా పారిజాత సత్పతి మాట్లాడుతూ ఈ యోగా శిబిరం ఎదుగుతున్న యువతలో ఆరోగ్యం, శాంతిని కలుగజేస్తాయని తెలిపారు. యోగా సాధన వారిలో మానసిక ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ శిబిరానికి పంపవచ్చని ఆమె చెప్పారు. సుమారు 135 మంది చిన్నారులు, యువత ఈ శిబిరంలో పాల్గొన్నారు.

సత్యసాయినగర్‌లో దంత వైద్య శిబిరం



దంత వైద్య శిబిరంలో గీతం దంత వైద్య కళాశాల విద్యార్థులు, కారుకొండ రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయి నగర్ కొండవాలు ప్రాంతంలో సత్యసాయి సంక్షేమ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం గీతం దంత వైద్యశాల, ప్రజా వైద్య విభాగం సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 70 మంది కాలనీవాసులకు దంత పరీక్షలు చేసి, అవసరమైన వారికి గీతం వైద్యశాలకు రిఫర్ చేశారు. దంతాల సంరక్షణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో గీతం దంత వైద్యశాల డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ మానస, డాక్టర్ యామిని, డాక్టర్ అఖిల, డాక్టర్ సంజయ్, డాక్టర్ భార్గవ ప్రిన్సి, సత్యసాయి సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘ అధ్యక్షుడు కారుకొండ రాజు, ఎల్.రవిశంకర్, కె.కనకరాజు, పి.ఎస్.రామారావు, కె.సత్యారావు పాల్గొన్నారు.